క్లుప్తంగా

సామూహిక కుంకుమ పూజలు



ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

కరప: స్థానిక గ్రామదేవత ఉప్పాలమ్మతల్లి ఆలయంలో శనివారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. వేదపండితులు విలపర్తి సత్యకృష్ణ ఆధ్వర్యంలో కరప, పరిసర గ్రామాల నుంచి వచ్చిన 120 మంది మహిళలతో కుంకుమ పూజలు జరిగాయి. ప్రతినెల పౌర్ణమి రోజున సామూహిక కుంకుమ పూజలు చేయిస్తున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీపాదం మురళీకృష్ణ తెలిపారు. కాకినాడనగర మాజీమేయర్ అరిగెల బున్ని వితరణతో భక్తులకు భోజన వసతి కల్పించారు. గొర్రెల శ్రీనివాస్, దేవు వీరబాబు తదితర కమిటీసభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కలశారాధనతో గోవింద పారాయణ



కలాశారాధనతో గోవింద పారాయణ నిర్వహిస్తున్న భక్తులు

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావు పేట దూసర్లపూడి వారి వీధిలోని స్వయంభూ భోగి గణపతి పీఠంలో కలశారాధనతో 37వ గోవింద పారాయణ శనివారం వైభవంగా నిర్వహించారు. 4 పాదాల 27జన్మ నక్షత్ర రాశులకు 108 శ్లోకాలుగా విష్ణుఆరాధనలో పఠించే సహస్ర నామం భగవద్గీత కంటే సులభంగా పారాయణ చేసే మార్గమని పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు అన్నారు. సంకష్ట హర చతుర్థి సందర్భంగా ఈ నెల 25న ఉదయం నగరసంకీర్తన, రాత్రికి సామూహిక సహస్ర నామ పారాయణ జరుగుతుందన్నారు.


నిత్యావసరాల పంపిణీ



రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో నిత్యావసర సరకులు అందజేస్తున్న బాపిరాజు, వెంకట్రావు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు విశ్రాంత తహసీల్దార్ రేలంగి బాపిరాజు ఆర్థిక సహకారంతో నిత్యావసర సరకులు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్ వెంకట్రావు మాట్లాడుతూ మన సంపాదనలో కొంత భాగం పది మందికి సహాయం చేయడం కోసం ఖర్చు చేయడంతో ఎంతో ఆనందం ఉందన్నారు. ప్రతి నెలా విశ్రాంత తహసీల్దార్ బాపిరాజు పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేసి ఆదుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.5 వేల విరాళం



హెచ్ఎంకు విరాళం ఇస్తున్న మోహన్‌బాబు

కరప: గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన ఆయుష్ వైద్యశాల డాక్టర్ మోహన్ బాబు విరాళం అందజేశారు. శనివారం పాఠశాల హెచ్ఎం ఎ.సాయిమోహన్‌కు రూ.5 వేలు అందించారు. హైస్కూలు విద్యార్థులకు అవసరమయ్యే క్రీడా సామగ్రి కొనుగోలు చేయాలని దాత సూచించారు. పాఠశాలకు టేబుల్ టెన్నిస్ బోర్డు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్టు ఉపాధ్యాయులు తెలుపగా డాక్టర్ మోహన్ బాబు స్పందించి త్వరలో టేబుల్‌టెన్నిస్ బోర్డు ఏర్పాటుకు ప్రయత్నం చేస్తానన్నారు. స్టాఫ్‌సెక్రటరీ ఐ.ప్రసాదరావు, ఉపాధ్యాయులు వీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చిట్‌ఫండ్ సంస్థపై ప్రచారం

కాకినాడ క్రైం: కాకినాడకు చెందిన ఓ చిట్‌ఫండ్ సంస్థ బోర్డు తిప్పేసిందంటూ శనివారం సామాజిక మాధ్యమాలలో ప్రచారం జరిగింది. ఖాతాదారులకు డబ్బులు ఇవ్వకుండా టోకరా పెట్టారని ప్రచారమవుతోంది. అయితే సదరు సంస్థ తమను మోసం చేసిందంటూ ఎటువంటి ఫిర్యాదులు ఖాతాదారుల నుంచి అందలేదని కాకినాడ టూ టౌన్ సీఐ నాగేశ్వర్‌నాయక్ తెలిపారు.

వానాకాలం.. వ్యాధులతో సమరం

- జ్వరాల వ్యాప్తికి అవకాశం
- సీజనల్ రోగాలపై అప్రమత్తం
- పరిసరాల పరిశుభ్రతే ముఖ్యం
- కాకినాడ ప్రభుత్వాస్పత్రుల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలు



కాకినాడ సిటీ: వర్షాకాలం ప్రారంభమైంది. వాతావరణంలో మార్పుల కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. అపరిశుభ్రత, ఆహారంలో లోపాల కారణంగా రోగాలు వస్తాయి. ముందు జాగ్రత్తలు పాటించకుంటే ఇబ్బందులు తప్పవని వైద్యులు సూచిస్తున్నారు. వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరి నిల్వ ఉండడంతో వ్యాధి కారకాలైన దోమలు, సూక్ష్మక్రిములు, బాక్టీరియా వృద్ధి చెందుతాయి. ప్రస్తుతం కాకినాడ సిటీ, రూరల్ ప్రాంతాల్లో అక్కడక్కడ మాత్రమే సాధారణ జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. వానాకాలంలో సాధారణ జ్వరం దగ్గర నుంచి ప్రమాదకరమైన డెంగీ వరకు వ్యాధులు సోకే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు.

వైరల్ జ్వరాలు

సీజన్ మార్పుతో పెరిగే సూక్ష్మక్రిముల వల్ల వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. గాలి, నీరు ద్వారా సూక్ష్మ క్రిములు శరీరంలోకి ప్రవేశించి జ్వరం సోకుతుంది. కొందరికి జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు ఉంటాయి. వైరల్ జ్వరం మూడు నుంచి ఏడు రోజుల వరకూ ఉంటుంది.

చికున్ గున్యా : దోమకాటు వల్ల చికున్ గున్యా వస్తుంది. తీవ్రమైన జ్వరం, కీళ్ల నొప్పులు ఎక్కువగా ఉంటాయి. రోజు రోజుకూ జ్వరం తీవ్రత పెరుగుతుంది.

మలేరియా : ఆడ అనాఫిలిస్ దోమ కుట్టడం వల్ల మలేరియా వ్యాపిస్తుంది. దోమ కాటు వల్ల దాని లోపల ఉన్న మలేరియా క్రిములు శరీరంలోకి ప్రవేశించి జ్వరం వస్తుంది. 14 రోజుల తర్వాత తీవ్ర జ్వరం వస్తుంది. ఈ దోమలు నిల్వ ఉన్న వర్షం నీటిలో వృద్ధి చెందుతాయి.

టైఫాయిడ్ : టైఫాయిడ్ సాల్మొనెల్లా టైపీ బాక్టీరియా వల్ల వస్తుంది. కలుషితమైన నీరు, ఆహారం వల్ల టైఫాయిడ్ వ్యాపిస్తుంది.

డెంగీ : ఈడిస్ ఈజిప్ట అనే దోమ కాటు వల్ల డెంగీ వ్యాపిస్తుంది. వైరల్ మాదిరిగా అకస్మాత్తుగా జ్వరం వస్తుంది. తలనొప్పి, ఒళ్లు నొప్పులు, ఎముకలు విరిగేటంత నొప్పి ఉంటుంది. ఒక్కోసారి శరీరం అంతర భాగాల్లో రక్తస్రావం జరుగుతుంది. కాళ్లు, చేతులు, ముఖం, వీపు, ఉదరం భాగాల చర్మంపై ఎర్రగా కందినట్లు చిన్నపాటి పొక్కులు వస్తాయి. ప్లేట్‌లెట్స్ పడిపోయి రోగి పరిస్థితి విషమంగా మారుతుంది. ఓవర్ హెడ్‌ట్యాంకులు, తాగిపడేసిన కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ వస్తువులు, టైర్లు వంటి వాటిల్లో చేరిన వర్షం నీటిలో ఈడిస్ దోమలు వృద్ధి చెందుతాయి.

హెపటైటిస్–ఏ: వర్షాకాలంలో హెపటైటిస్–ఏ (కామెర్లు) వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. కలుషితమైన నీరు, ఆహారం ద్వారా ఈ వ్యాధి సూక్ష్మక్రిములు శరీరంలోకి వ్యాపిస్తాయి. ఇది కాలేయకణాల్లో సక్రమిస్తుంది. కాలేయ వ్యాధి కారణంగా రక్తంలో బిలిరుబిన్ పరిమాణం పెరుగుతుంది. శరీర భాగాల పసుపు రంగులో కనిపిస్తాయి.

జాగ్రత్తలు ఇవీ

- ఇళ్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- కూలర్లు, టైర్లు, కొబ్బరి బొండాలు, ఇతర సామగ్రి, తదితర వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- నిల్వ ఉన్న నీటిలో కిరోసిన్ గాని లేదా పురుగు మందు కలపాలి.

జాగ్రత్తలు తప్పనిసరి



ప్రస్తుతం సీజనల్ వ్యాధులు సోకే సమయం. జ్వరం ఉంటే వెంటనే స్థానిక హెల్త్‌సెంటర్లు, యూపీహెచ్‌సీల్లో సంప్రదించాలి. అక్కడ ఉచితంగా రక్తపరీక్షలు నిర్వహించి, సకాలంలో వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జ్వరాలు ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో వైద్య క్యాంపులు ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నాం. ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించాలి. శుభ్రమైన నీళ్లు, ఆహారం తీసుకోవాలి. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటించాలి.

– డాక్టర్ పృథ్వీచరణ్, మున్సిపల్‌హెల్త్ ఆఫీసర్, కాకినాడ నగరపాలక సంస్థ

- దోమలు కుట్టకుండా దోమ తెరలు వినియోగించాలి.
- శరీరం మొత్తం కప్పేలా దుస్తులు ధరించాలి.
- రోగ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.
- భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలి.
- నిల్వ పదార్థాలు తినకూడదు. తాజా, వేడి ఆహారం తీసుకోవాలి.
- కాచి చల్లార్చిన నీటిని తాగాలి.
- వ్యక్తిగత మరుగుదొడ్లు వాడాలి.
- శుభ్రమైన ఆహారం తీసుకోవాలి.
- రోజుకు 3 నుంచి 4 లీటర్ల నీళ్లు తాగాలి.
- పండ్ల రసం, కొబ్బరి నీళ్లు, సూప్ వంటివి తీసుకోవాలి.
- వైద్యుల సూచనల మేరకు వైద్యం తీసుకోవాలి.

రేపు డయల్ యువర్ కమిషనర్

- అదే రోజు ప్రజా ఫిర్యాదుల పరిష్కారం
- కమిషనర్ వెంకటరావు వెల్లడి

కాకినాడ: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 9:30కు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు తెలిపారు. పదిన్నర గంటల వరకు కార్పొరేషన్ కార్యాలయం 0884–2357800 నంబర్‌కు డయల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చునన్నారు. అలాగే 10:30 నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కోసం కాకినాడ నగర పాలక సంస్థ మీటింగ్ హాల్‌లో నేరుగా వినతులు స్వీకరిస్తామన్నారు. డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు విచ్చేసి ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చునని కమిషనర్ సూచించారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌కు వాటర్ కూలర్ వితరణ



వాటర్ కూలర్ అందజేస్తున్న దాత

కాకినాడ సిటీ: అర్బన్ హెల్త్ సెంటర్ హాస్పిటల్‌కు వచ్చే రోగులకు తాగునీటి వసతిని కల్పించేందుకు లయన్స్ క్లబ్, కాకినాడ సఖి రూ.10 వేలు విలువ చేసే వాటర్ కూలర్ బహూకరించడం అభినందనీయమని లయన్స్ పూర్వపు జిల్లా గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. కాకినాడ కొండయ్యపాలెం అర్బన్ హెల్త్ సెంటర్లో క్లబ్ ప్రెసిడెంట్ సామా రత్నమాల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ బాదం బాలకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన కూలర్‌ను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. బాలకృష్ణ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సఖి చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ఇతర క్లబ్బులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ పద్మ, తులసి, నూలు నాగలక్ష్మి, సామా శ్రావ్య, స్వప్న సావిత్రి, రమణి, రాజి, కుమారి, అమ్మాజీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో భారత్ నృత్యోత్సవ్

జగ్గంపేట: కేరళలో ఇటీవల భారత్ నృత్యోత్సవ్ పేరిట 100 రోజుల పాటు జరిగిన నృత్య ప్రదర్శన గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నమోదైందని జగ్గంపేట నృత్య కళాకారిణి ముళ్లపూడి విజయలక్ష్మి తెలిపారు. శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ జగ్గంపేటలోని శ్రీసీతారత్నం నృత్య కళావేదికకు చెందిన 96 మంది విద్యార్థులు కేరళలో జరిగిన నృత్యోత్సవంలో పాల్గొన్నారన్నారు. పాల్గొన్న విద్యార్థులకు నిర్వాహకులు సర్టిఫికెట్లు అందజేశారని చెప్పారు. జగ్గంపేట, ధర్మవరం గ్రామాలకు చెందిన విద్యార్థులు 10 రోజుల పాటు కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో పలు ప్రముఖ దేవాలయాలతో పాటు చివరగా విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో నృత్య ప్రదర్శనలు ఇచ్చారని వివరించారు.

నయనానందం.. పుష్పోత్సవం

- వైభవంగా భీమేశ్వరునికి పుష్పయాగం
- వేడుకగా వేంకటేశ్వరునికి పూజలు

బోట్ క్లబ్: స్థానిక దేవాలయం వీధిలో ఉన్న బాలా త్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామి వారికి పుష్పయాగ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీ పుష్పయాగం సందర్భంగా స్వామివారికి ఆలయం ఈఓ రాపర్తి రాజేశ్వరరావు వివిధ రకాల పండ్లు, స్వీట్లు అందించారు. ఆలయ అర్చకులు కొడమంచిలి కార్తీక్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కరప: కొంగోడులో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి స్వామి వారికి పుష్పోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఏటా జ్యేష్ఠ మాసంలో స్వామివారి దివ్యకల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఈనెల 17వ తేదీ స్వామి కల్యాణాన్ని ప్రధాన అర్చకుడు పెద్దింటి రామానుజాచార్యులు నిర్వహించారు. కల్యాణోత్సవంలో భాగంగా శనివారం శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా, వేంకటేశ్వరస్వామి వారిని పెండ్లి కుమారునిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి పుష్పోత్సవం నిర్వహించారు. రాత్రి ఊయలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి, స్వామి,అమ్మవార్లను ఊయలలో ఉంచి, వివిధ రకాల స్వీట్లు ఉంచి పుష్పోత్సవాన్ని నిర్వహించారు. మాజీసర్పంచ్ మేడిశెట్టి సుబ్బరాజు, మాజీఎంటీసీ ఆట్ల గోవిందరాజులు, నక్కా గోవిందు, మేడిశెట్టి సత్తిరాజు తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.



శ్రీపుష్పయాగ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



కొంగోడు ఆలయంలో ఊయలలో ఉంచిన వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లు

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలి



కొంగోడులో గర్భిణులకు సామూహిక సీమంతం

కరప: అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు పోషకాహారం అందించడమే కాకుండా ఆటపాటలతో విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారని కాకినాడ రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ వై.లక్ష్మి పేర్కొన్నారు. అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శనివారం గొర్రిపూడి సెక్టార్‌లోని కొంగోడు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, ప్రజాప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మూడేళ్లు నిండిన పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. చిన్నారులతో పాటు గర్భిణులకు, బాలింతలకు కూడా పోషకాహారం అందిస్తున్నామన్నారు. ముందుగా అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ నాయకులు గ్రామంలోఅంగన్‌వాడీ పిలుస్తోంది ర్యాలీ నిర్వహించి, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి మూడేళ్ల వయసున్న పిల్లలను అంగన్‌వాడీకి పంపించాలని తల్లిదండ్రులను చైతన్య పరచారు. తర్వాత కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి, చిన్నారులకు పట్టాలిచ్చారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి, పసుపుకుంకుమ, గాజులు, నూతన వస్త్రాలు అందజేశారు. బాలింతలకు పోషకాహార కిట్లను అందజేశారు. గ్రామసర్పంచ్ నక్కా అప్పలస్వామి, మాజీసర్పంచ్ మేడిశెట్టి సుబ్బరాజు, మాజీఎంపీటీసీ ఆట్ల గోవిందరాజులు, ఉపసర్పంచ్ వనుం నారాయణరావు, సెక్టార్‌సూపర్‌వైజర్‌లు కె.విజయలక్ష్మి, కె.అన్నపూర్ణ, హెచ్ఎస్ జి.నారాయణమ్మ తదితర ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఓ కార్యాలయం తనిఖీ

సామర్లకోట: స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయాన్ని జిల్లా సమగ్ర శిక్ష సీఎంఓ, ఐఆర్‌సీ కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు శనివారం తనిఖీ చేశారు. మండల పరిధిలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, వారికి వచ్చిన స్టూడెంట్స్ కిట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు మండల పరిధిలో కిట్లు భద్రపర్చిన స్టాక్ పాయింట్ ఆయన పరిశీలించారు. ఒకటో తరగతి విద్యార్థులకు 469 డిక్షనరీలు, ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు 60,431, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు నోట్ బుక్స్ 56,052, బాలుర బూట్లు 3,956, బాలికల బూట్లు 4.134 వచ్చాయని ఎంఈఓ పి.పుల్లయ్య–2 వివరించారు. విద్యార్థులకు యూనిఫాం, బాగ్స్ రావాల్సి ఉందని తెలిపారు. అనంతరం చామంతి నాగేశ్వరరావు దివ్యాంగ విద్యార్థులకు ఐఈఆర్‌పీ ద్వారా నిర్వహించే ఇంటి వద్దనే విద్య కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ మేరకు పట్టణ పరిధిలోని వీర్రాఘవపురం దివ్యాంగ విద్యార్థి యాళ్ల ప్రజ్ఞ సాయి ఇంటిని సందర్శించి అక్కడ జరిగిన ప్రత్యేక బోధనా పరికరాలను ఉపయోగించి ఐఈఆర్‌టీ ప్రత్యేక విద్య వివరాలను తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు.

ప్రజలకు సురక్షితమైన తాగునీరందించాలి



వేళంగిలో వీధి కుళాయి వద్ద తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కరప: గ్రామాల్లోని మంచినీటి ట్యాంక్‌లను వారానికొకరోజు శుభ్రచేయించి, క్లోరినేషన్ చేసిన సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయాలని ఎంపీడీఓ కె.అప్పారావు సూచించారు. వేళంగి, వాకాడ గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి, మంచినీటి ట్యాంక్‌లను పరిశీలించి, క్లోరినేషన్ చేశారో, లేదోనని ఆయన తనిఖీ చేశారు. గ్రామ కార్యదర్శులు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ వర్షాకాలంలో అంటువ్యాధులను కట్టడి చేసేందుకు ఎప్పటికప్పుడు మంచినీటి పైపులు లీక్‌లు లేకుండా చూడాలని, తప్పనిసరిగా క్లోరినేషన్ చేసిన తర్వాతనే తాగునీరు సరఫరా చేయాలని ఎంపీడీఓ అప్పారావు సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వీవీఎస్ వర్ధన్ పెనుగుదురు, గొర్రిపూడి గ్రామాల్లో పర్యటించి మంచినీటి క్లోరినేషన్, వాటర్‌ట్యాంక్‌లు శుభ్రంచేయించిందీ, లేనిదీ తనిఖీ చేశారు. ఆయా గ్రామాల కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, పి.వీరభద్రరావు, బి.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

అతిసారపై అప్రమత్తత అవసరం



ఇట్ల కిషోర్, ఆర్డీవో, కాకినాడ

కాకినాడ సిటీ: సీజనల్ వ్యాధుల నేపథ్యంలో పట్టణ గ్రామీణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారి ఇట్ల కిషోర్ కోరారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యంగా పంచాయతీ రెవెన్యూ గ్రామీణ నీటి సరఫరా శాఖలు సమన్వయంతో పని చేయాలని, ముఖ్యంగా ఓవర్‌హెడ్ ట్యాంకులు తక్షణం శుభ్రపరిచి క్లోరినేషన్ చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని, ముఖ్యంగా నిల్వ పదార్థాలు, నిల్వ ఉంచిన మాంసం వంటి పదార్థాలు తీసుకోవద్దని, కాచి చల్లార్చిన వేడి నీటిని మాత్రమే తీసుకోవాలన్నారు. డివిజనల్ స్థాయిలో సీజనల్ వ్యాధులకు సంబంధించి ఏమైనా సమాచారం ఉంటే ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కంట్రోల్ రూమ్ నంబర్ 8008803208 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలపాలని ఆర్డీవో కిషోర్ వివరించారు.

వైభవంగా ఏరువాక పౌర్ణమి

- నాగలిపట్టి ఏరువాక సాగిన డాక్టర్ ఉమర్ ఆలీషా



కాడి పట్టి ఏరువాక సాగుతున్న పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా

పిఠాపురం: స్థానిక శ్రీవిశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ఆవరణలో శనివారం సస్య వృద్ధి బీజారోపణ ఏరువాక పౌర్ణమి ఉత్సవం నిర్వహించారు. పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా ఆధ్వర్యంలో ఈ ఏరువాక ఉత్సవం నిర్వహించగా వివిధ ప్రాంతాల నుంచి సుమారు 400 మంది రైతులు పాల్గొన్నారు. పీఠం వ్యవసాయ క్షేత్రంలో డాక్టర్ ఉమర్ ఆలీషా అరక కట్టి, నాగలిపట్టి ఏరువాక సాగారు. దివ్య బీజం, విత్తనాలు, గోకృపామృతం రైతులకు పంపిణీ చేశారు. సేంద్రియ వ్యవసాయం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, జీవరసాయన పదార్థాలు వాడటం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రైతులు ఎడ్లకు ధాన్యం, బెల్లం తినిపించి పసుపు కుంకుమతో అలంకరించి భారతీయ సంస్కృతీ సంప్రదాయాల ప్రకారం ఏరువాక కార్యక్రమం విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తాము ప్రకృతి సాగు చేయడం వల్ల కలిగిన ప్రయోజనాలను తోటి రైతులకు వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు ఏవీ రామాంజనేయులు, నీలిమ, ఎం.రామ్‌గోపాలవర్మ, రత్నప్రశాంతి, వ్యవసాయాధికారులు సీహెచ్ సత్యనారాయణ, అరుణ తదితరులు సాగులో మిత్ర పురుగుల ద్వారా చీడపీడల నివారణ, డ్రోన్, ఆధునిక వ్యవసాయ పరికరాలు ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. వ్యవసాయంలో మారిన ఆధునిక పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం ప్రయోజనాలను రైతులకు వివరించారు. అనంతరం ఆదర్శ రైతులను పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

గణపతి నవరాత్ర ఉత్సవాలపై సమీక్ష



సమావేశంలో చర్చిస్తున్న నగర గణేశ ఉత్సవ సమితి సభ్యులు

బోట్‌క్లబ్: స్మార్ట్ సిటీలో సెప్టెంబర్ ఏడో తేదీ నుంచి గణపతి నవరాత్ర ఉత్సవాలు, 16న గణేశ నిమజ్జనం వేడుక నిర్వహించనున్నట్టు నగర గణేశ ఉత్సవ సమితి ప్రకటించింది. శనివారం ఉదయం స్థానిక సూర్యారావు పేట దూసర్లపూడి వారివీధిలోని భోగిగణపతి పీఠంలో సీనియర్ పథాధికారి దువ్వూరి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన సమావేశం జరిగింది.

జగన్నాథపురం రెండు వంతెనల మధ్య, వార్ఫ్ రోడ్, వినాయకసాగర్, వాకలపూడి బీచ్ రోడ్ తీరంలో గణేశ నిమజ్జన చేయాలని సమావేశంలో తీర్మానించారు. నిర్వహణపై సమితి కన్వీనర్ సారథ్యంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, కలెక్టర్ జే నివాస్, ఎస్పీ, ఆర్డీవోలకు సమితి వినతులను అందించాలని నిర్ణయించింది. ఉత్సవాలు నిర్వహణపై జూలై 7న విస్తృత సమావేశం నిర్వహిస్తామని సమితి కన్వీనర్ వై.మాలకొండయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి రూరల్ కన్వీనర్ రంభాల వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు, సభ్యులు కొక్కిలి గడ్డ గంగరాజు, బొలిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.